## క్లుప్తంగా

### ప్రమాదాల నియంత్రణకే వాహన తనిఖీలు



బండ్లగూడ: ప్రమాదాలను నివారించేందుకే వాహనాల తనిఖీలను నిర్వహిస్తున్నామని నార్సింగి ట్రాఫిక్ సీఐ కృష్ణ అన్నారు. శనివారం షాదాన్ కళాశాల ఆవరణలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లైసెన్స్, హెల్మెట్, సీట్ బెల్ట్ లేకుండా ప్రయాణిస్తున్న వారికి చలాన్లు విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనాదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పక పాటించాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలను నడపరాదన్నారు. హెల్మెట్, సీట్ బెల్ట్‌ను ధరించాలని సూచించారు. మైనర్లకు వాహనాలను ఇస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడపడం ప్రమాదకరమన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

### టీబీ బాధితులకు చేయూత



సరుకులను అందజేస్తున్న కొమిరెడ్డి ఉమామహేశ్వరిరెడ్డి

రాజేంద్రనగర్: ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని జనహిత వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకురాలు, బీజేపీ మహిళా నేత కొమిరెడ్డి ఉమామహేశ్వరిరెడ్డి అన్నారు. టీబీతో బాధపడుతున్న వారిని ఆమె ఆరు నెలలు దత్తత తీసుకున్నారు. బుద్వేల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో వనితా దామోదర్‌రెడ్డి, డాక్టర్ ప్రీతిరెడ్డి, ప్రతిమ, అభిలాష్ సహకారంతో శనివారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2025 నాటికి భారత్‌లో టీబీని నిర్మూలించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఇందులో భాగంగా ఆరు నెలల పాటు టీబీతో బాధపడుతున్న వారిని దత్తత తీసుకోవడం జరిగిందన్నారు. ప్రతి నెల నిత్యావసర వస్తువులు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

### ఆంగ్ల పదజాల పరీక్ష



పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు

రాజేంద్రనగర్: శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం గచ్చిబౌలిలోని క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఆంగ్ల పదజాల పరీక్ష నిర్వహించారు. శంషాబాద్, రాజేంద్రనగర్, గండిపేట మండలాలకు చెందిన పాఠశాలల విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొదటి బహుమతి ఐదుగురికి రూ.500, రెండో బహుమతిగా ఐదుగురికి రూ.250, మూడో బహుమతిగా ఐదుగురికి రూ.200 చొప్పున అందజేశారు. పరీక్షలో పాల్గొన్న విద్యార్థులకు నిఘంటువులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషన్, క్లాస్‌మెట్ క్లబ్ అధ్యక్షులు విజయ్‌కుమార్, మోగులయ్య, పుష్పలత, వాణిశ్ర, గ్లోరీ, హనుమంతరావు, జాన్సన్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

### రోడ్లపై చెత్త వేయొద్దు



వాహనాలతో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రోడ్లపై వ్యాపార సంస్థలు, ప్రజలు ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తే భారీ జరిమానాలు విధిస్తామని మణికొండ మున్సిపల్ శానిటేషన్ ఇన్‌చార్జి సంపత్ అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 25 నుంచి అలిజాపూర్ వరకు ఆటోలతో ర్యాలీ నిర్వహించి షాపుల వారిని చెత్తను తడి, పొడిగా వేరు చేయాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆటో కార్మికులు పాల్గొన్నారు.

---

# అభివృద్ధిలో ఆదర్శం

**వార్డ్ వాచ్..**

పుప్పాలగూడ, మణికొండ, నెక్నాంపూర్ గ్రామ పంచాయతీలు విలీనమై మణికొండ మున్సిపాలిటీగా రూపాంతరం చెంది మూడేళ్లు గడిచింది. గత మున్సిపల్ ఎన్నికల్లో ఆయా వార్డుల ప్రజలు తమకు నచ్చిన వారిని కౌన్సిలర్‌లుగా ఎన్నుకున్నారు. మున్సిపాలిటీలో నిధుల కొరత లేకపోవడంతో అందుకు అనుగుణంగానే పలు వార్డులలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. కొన్ని వార్డుల్లో ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక నిధులను సైతం వెచ్చించి అనేక అభివృద్ధి పనులను చేపడుతున్నారు. గత మూడేళ్లలో వార్డుల వారీగా జరిగిన అభివృద్ధి, చేపట్టాల్సిన పనులపై 'సాక్షి' 'వార్డ్ వాచ్' –మణికొండ



మణికొండ కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ (ఫైల్)



కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులు

- సౌకర్యాల కల్పనలో అగ్రగామి
- కొనసాగుతున్న ప్రధాన పనులు
- ప్రగతి పథంలో 13వ వార్డు

#### మౌలిక వసతులకు పెద్దపీట...

◆ మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని 13 వార్డులో మౌలిక వసతుల కల్పనకు కౌన్సిలర్ బి. శ్వేతరవి కాంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా రోడ్లు డ్రైనేజీ సమస్యలపై ఆమె ప్రధానంగా దృష్టి సారించారు. అంతేగాక వార్డు ప్రజలకు అత్యవసరమైన రెండు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల ప్రజలకు ఉపయోగపడేలా బస్తీ దవాఖానను ఏర్పాటు చేశారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు రోడ్లపై నిలిచిపోతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ నేపథ్యంలో నేతాజీ కాలనీ, నైన్‌బార్ వద్ద అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను చేపట్టి సమస్యను పరిష్కరించారు. యువతను ప్రోత్సహించేందుకు క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేస్తున్నారు. అందులోనే ఓపెన్ జిమ్‌ను సైతం ఏర్పాటు చేశారు.

#### అభివృద్ధి పనులివీ..

◆ 13వ వార్డు పరిధిలోని మర్రిచెట్టు నుంచి యూనియన్ బ్యాంక్ వరకు బీటీ రోడ్డు, హనుమాన్‌టెంపుల్ రోడ్డు, నైన్‌బార్ రోడ్డు, పోచమ్మ కాలనీరోడ్లను సీసీ, బీటీ రోడ్లుగా రూ. 2.50 కోట్ల నిధులతో అభివృద్ధి చేశారు.

◆ అంజలిగార్డన్, లక్ష్మీనగర్ నుంచి వచ్చే వరద నీరు నైన్‌బార్ ముందు ప్రధాన రోడ్డుపై నిలిచి ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా మారటంతో రూ. 3 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించి సమస్యను పరిష్కరించారు. నేతాజీ కాలనీ, లక్ష్మీనగర్, మర్రిచెట్టు సర్కిల్‌లలో డ్రైనేజీ పనులు చేపట్టడంతో మురుగునీరు సులభంగా బయటికి వెలుతుంది.



కొనసాగుతున్న స్టేడియం నిర్మాణ పనులు

◆ పాత మణికొండ గ్రామంతో పాటు మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల ప్రజలకు ఉపయోగపడేలా పాత గ్రామపంచాయతీ కార్యాలయాన్ని రూ. 30లక్షల ఖర్చుతో బస్తీ దవాఖానాగా అభివృద్ధి చేసి మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌లతో కలిసి ప్రారంభించారు.

◆ ల్యాంకోహిల్స్ పక్కన రూ.75 లక్షలతో క్రీడా ప్రాంగణం అభివృద్ధి పనులను చేపట్టారు. మరో రూ. 2కోట్లను ఖర్చుచేసి ఆదర్శ క్రీడాప్రాంగణంగా తీర్చిదిద్దేందుకు పనులు కొనసాగుతున్నాయి.

◆ శ్మశానవాటికలో అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు రూ. 1.17కోట్లు వెచ్చిస్తున్నారు.

◆ పోచమ్మకాలనీ, జలమండలి కార్యాలయం పక్కన ప్రజావసరాలకు అనుగుణంగా రూ.1.10 కోట్లతో కమ్యూనిటీ హాల్‌ల నిర్మాణాలను చేపట్టారు.



మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌లతో కలిసి బస్తీదవాఖానాను ప్రారంభించిన కౌన్సిలర్ శ్వేత రవికాంత్‌రెడ్డి(ఫైల్)

#### ఆధునిక స్టేడియం నిర్మించాలి



మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ల్యాంకోహిల్స్ పక్కన ఐదు ఎకరాలలో స్టేడియం నిర్మించేందుకు పనులు చేపట్టడం ఆనందంగా ఉంది. యువత ఆటలాడుకునేందుకు సరైన స్థలాలు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. ఓపెన్ స్టేడియంతో పాటు ఇండోర్ స్టేడియం నిర్మాణం చేపడితే మరింత మంది క్రీడాకారులు, యువతకు మేలు జరుగుతుంది.

–కె.సునీల్‌రెడ్డి, మణికొండ

#### సమగ్ర అభివృద్ధి జరుగుతుంది



మణికొండ మున్సిపాలిటీలోనే 13వ వార్డు అన్ని రంగాలలో ఆదర్శంగా నిలుస్తుంది. ప్రజలకు అవసరమైన కమ్యూనిటీహాళ్లు, బస్తీ దవాఖానా, రోడ్లు, డ్రైనేజీ, స్టేడియం, ఓపెన్ జిమ్, శ్మశానవాటిక అభివృద్ధి తదితర పనులను చేపట్టారు. వార్డు అభివృద్ధికి కౌన్సిలర్‌పై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిరంతరం కృషి చేస్తుండటం అభినందనీయం.

–ఈ. వెంకటేశ్వర్‌రావు, మణికొండ

#### సమస్యలు లేని వార్డుగా తీర్చిదిద్దుతా



ప్రతి వార్డులో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సమస్యలు పెరుగుతాయి. వాటిని ఎప్పటికప్పుడు గుర్తించి అధికారులు, చైర్మన్, వైస్ చైర్మన్ల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నా. 13వ వార్డులో అత్యధికంగా పాత గ్రామం కావడంతో అభివృద్ధి పనులను ప్రస్తుతానికి అనుగుణంగా మార్పులు చేయాల్సి వస్తుంది. రాబోయే రోజుల్లో సమస్యలను లేని వార్డుగా తీర్చిదిద్దేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తా. వార్డు అభివృద్ధికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు.

–బి. శ్వేతరవికాంత్‌రెడ్డి, కౌన్సిలర్, 13వ వార్డు, మణికొండ మున్సిపాలిటీ

---

## కమనీయం సీతారాముల కల్యాణం



అమ్మపల్లి ఆలయంలో ఉత్సవ మూర్తుల ఊరేగింపు



అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ రూరల్: మండలంలోని అమ్మపల్లి (శ్రీసీతారామచంద్రస్వామి) దేవాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకిలో ఆలయం ఎదురుగా ఉన్న కల్యాణ మంటపం వద్దకు తీసుకొచ్చారు. మంటపంలో స్వామి కల్యాణం కనుల పండవగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తన్వీ, ఆలయ కమిటి సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

**శనైశ్చర దేవాలయంలో...**

మదన్‌పల్లి సమీపంలోని శనైశ్చర దేవాలయంలో శనివారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, పాల్మాకుల సొసైటీ చైర్మన్ కె.శ్రవణ్‌కుమార్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

### నార్సింగిలో సినీహీరో అర్జున్ సందడి



మణికొండ: సినీ హీరో అర్జున్ శనివారం నార్సింగిలో సందడి చేశారు. ఇటీవల నార్సింగి మాజీ సర్పంచ్ ప్రసన్న అశోక్‌యాదవ్ కుమారుడి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరుకాలేకపోయిన అర్జున్ శనివారం ఆయన ఇంటికి వచ్చి అతడి ఆశీర్వదించారు. అర్జున్ వచ్చిన విషయం తెలియడంతో ఆయన అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అతనితో ఫొటోలు దిగేందుకు పోటీలు పడ్డారు.

### సూర్య నమస్కారాలతో ఆరోగ్యం



మణికొండ: ప్రతి రోజు అరగంట సూర్యనమస్కారాలు చేస్తే ఆరోగ్యవంతంగా జీవించే అవకాశం ఉంటుందని స్వాస్థ్రీ యోగా అకాడమీ నిర్వాహకురాలు అంజనాదేవి అన్నారు. శనివారం రథ సప్తమిని పురస్కరించుకుని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అనంతపద్మనాభస్వామి దేవాలయ ఆవరణలో సూర్యథాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 108 సూర్యనమస్కారాలను చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయాన్నే సూర్య నమస్కారాలు చేయడంవల్ల శరీరంలోని అన్ని కండరాలు, ఎముకలు కదిలి పని చేసేందుకు అనుకూలంగా మారతాయన్నారు. కార్యక్రమంలో పి.శ్రీనివాస్, బాబులాల్, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి



అత్తాపూర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ మొండ్ర సంగీత గౌరీశంకర్ తదితరులు

రాజేంద్రనగర్: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మొండ్ర సంగీతగౌరీశంకర్ అన్నారు. శనివారం ఆమె జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి డివిజన్ పరిధిలో పర్యటించారు. జలాల్ బాబానగర్‌లో ఫిరంగినాలా పూడిక తీత పనులను, కబ్జాకు గురవుతున్న నాలాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలాలను కబ్జా చేసేందుకు యత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నాలాల పూడికతీత పనులను వేగవంతం చేయాలని సూచించారు. నాలాలపై జీహెచ్ఎంసీ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. 118 పిల్లర్ వద్ద హనుమాన్ దేవాలయం నుంచి లక్ష్మీనగర్ కాలనీకి వెళ్లే రహదారి పార్కు సమీపంలో చిన్నదిగా ఉండడంతో భారీ వాహనాలు వెళ్లే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వెంటనే రోడ్డు వెడల్పు పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో అత్తాపూర్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి రావుల జగన్, జీహెచ్ఎంసీ ఏఈ నర్సింహమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఆల్ ఇండియా ఎగ్జిబిషన్‌కు విశేష ఆదరణ





మణికొండ: దేశవ్యాప్తంగా చేతి వృత్తుల వారు తయారు చేసిన అనేక వస్తువులన్నీ ఒకే చోట లభిస్తుండటంతో మణికొండ వాసులు ఆదరిస్తున్నారు. మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని పైప్‌లైన్‌రోడ్డులో ఐడీఎఫ్‌సీ బ్యాంక్ పక్కన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్, హ్యాండీ క్రాఫ్ట్ మేళా ఏర్పాటు చేశారు. అందులో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్, లినెన్, కలాంకారి, బెంగాల్ కాటన్, బనారస్ చీరలతో పాటు ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజ్‌లు, ఖాదీ మెటీరియల్‌లతో పాటు వన్ గ్రామ్ గోల్డ్ జ్యూవెలరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి బొమ్మలు అందుబాటులో ఉన్నాయి. చేతి వృత్తులను ఆదరించడంతో పాటు నాణ్యతమైన దుస్తులు కొనుగోలు చేసే అవకాశం లభిస్తుందని వారు పేర్కొంటున్నారు. ఈనెల చివరి వరకు మేళా కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

### అత్తాపూర్ ఔట్‌పోస్ట్ సందర్శన



రాజేంద్రనగర్: సులేమాన్‌నగర్‌లోని డైమండ్ మిషన్ స్కూల్ విద్యార్థులు శనివారం అత్తాపూర్ ఔట్ పోస్టు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. విద్యార్థులకు పోలీస్‌స్టేషన్ పరిసరాలు, పోలీసుల విధులపై అవగాహన కల్పించారు. ఫిర్యాదులు ఎలా చేయాలి, రైటర్, ఏఎస్ఐ, ఎస్సై, సీఐ, కానిస్టేబుల్ విధులు, పోలీస్‌స్టేషన్‌లోని లాకప్ గది తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు పాఠశాలలో ఆటల పోటీలతో పాటు స్వాతంత్ర సమరయోధులు వారి జీవిత చరిత్రపై కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అలాగే శాంతి భద్రతలో పోలీసుల పాత్ర అంశంపై స్టేషన్‌కు తీసుకువచ్చినట్లు తెలిపారు.

### ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



కార్పొరేటర్ పద్మావతి పాపయ్యయాదవ్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

బండ్లగూడ: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ పద్మావతి పాపయ్యయాదవ్ అన్నారు. కార్పొరేటర్‌గా విజయం సాధించి 3 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నర్సారెడ్డి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శనివారం ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దశల వారిగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఎక్కడ ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు మస్తాన్ అలీ, ప్రధాన కార్యదర్శి ఉస్మాన్, డాక్టర్ రెహమాన్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

### దాడి కేసులో నిందితుడి అరెస్టు

మైలార్‌దేవ్‌పల్లి: వ్యక్తిగత కక్షలతో ఓ వ్యక్తిపై దాడి చేసి ఇంటి రెండో అంతస్తు నుంచి కిందకు తోసివేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మైలార్‌దేవ్‌పల్లి ఎస్సై మహ్మద్ నయీం కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన శ్రీనివాసచారి, కృష్ణ కుటుంబాలు లక్ష్మిగూడలో రాజీవ్‌గృహ కల్పలో నివాసం ఉంటున్నాయి. శ్రీనివాసచారి రెండో అంతస్తులో, కృష్ణ 4వ అంతస్తులో ఉంటున్నారు. నెల రోజుల క్రితం 4వ అంతస్తులో ఉన్న కృష్ణ ఉదయం బ్రష్ చేస్తూ కిందికి ఉమ్మడంతో 2వ అంతస్తులో ఉన్న శ్రీనివాసచారిపై పడింది. ఈ ఘటనపై పలుమార్లు ఇరు కుటుంబాలు గొడవపడ్డారు. శుక్రవారం రాత్రి ఇంటికి వచ్చిన కృష్ణ నాల్గవ అంతస్తుకు వెళుతుండగా రెండో అంతస్తులో దారి కాచిన శ్రీనివాసచారి అతడిని కిందకు తోసివేశాడు. ఈ ఘటనలో కృష్ణ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. తప్పించుకు తిరుగుతున్న శ్రీనివాసచారిని శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

### బాలికపై లైంగిక దాడి

రాజేంద్రనగర్: ఓ బాలికపై లైంగికదాడికి పాల్పడిన యువకుడిని అత్తాపూర్ ఔట్‌పోస్టు పోలీసులు శనివారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హసన్‌నగర్ ప్రాంతానికి చెందిన దంపతులు గత ఆరు నెలలుగా వేరుగా ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు. నెల రోజుల క్రితం బాధితురాలు (13) అదే ప్రాంతంలో ఉంటున్న తండ్రి వద్దకు వెళ్లి అక్కడే ఉంటోంది. ఈ సమయంలో ఆమెకు సోదరుడి వరసయ్యే యువకుడు ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో సదరు బాలిక గర్భం దాల్చింది. శరీరంలో మార్పులు గమనించిన తల్లి బాలికను నిలదీయగా విషయం చెప్పడంతో అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

### అనాథాశ్రమంలో పుట్టిన రోజు వేడుకలు



రగడంపల్లి శ్రావణ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

రాజేంద్రనగర్: అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాల్లో పుట్టిన రోజులు, ఇతర శుభ కార్యక్రమాలు జరుపుకోవాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ తెలంగాణ జాగృతి కన్వీనర్ రగడంపల్లి శ్రావణ్ అన్నారు. శనివారం శివరాంపల్లి, ఆరాంఘర్, కిస్మత్‌పూర్‌లలోని అనాథ, వృద్ధాశ్రమాల్లో తన పుట్టిన రోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అంతకు ముందు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌లను కలిసి ఆశీర్వాదం పొందారు.